# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రతీ నియోజవకర్గంలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ దేశంలో నూతన విమానాశ్రయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విజయవాడలో విడుదల చేయనున్నారు.
- ❖ విజయవాడలో ఈనెల 17వ తేదీన పర్యాటక పెట్టుబడిదారుల సదస్సుని నిర్వహిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ నైరుతి - ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ప్రస్తుతం కొనసాగుతోంది.

=======================

రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన చాలా ప్రధానమైన అంశమని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెండవ రోజు అయిన ఈ రోజు కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ... పరిశ్రమలు, ఐటీ పార్కులపై దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్లను కోరారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేలా అనుకూల వాతావరణం కల్పించాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

=======================

దేశంలో నూతన విమానాశ్రయాలు ఏర్పాటుతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నేరుగా విమాన సర్వీసులను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నూతనంగా ప్రారంభిస్తున్న విమాన సేవల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానం చేస్తున్నామన్నారు. అలాగే స్థానిక ఉత్పత్తులను సులువుగా ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 37 సెకన్లు)

======================

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విజయవాడలో విడుదల చేయనున్నారు. స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతీ జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా రానున్న రెండు దశాబ్దాల కాలంలో రాష్ట్రంలో వివిధ రంగాలకు సంబంధించిన ప్రగతి ప్రణాళికలను స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047లో పొందుపరచనున్నారు.

======================

రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి కోసం ఈ నెల 17వ తేదీన విజయవాడలో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సును నిర్వహిస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అమరావతిలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ.... నూతన పారిశ్రామిక విధానం మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారుల అవసరాలను తెలుసుకుని భవిష్యత్ లో వాటిని అమలు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం "సాస్కి స్కీమ్" ద్వారా అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు సంబంధించిన నిధులు మంజూరు చేస్తోందని మంత్రి తెలిపారు.

======================

రాష్ట్రంలో వివిధ సామాజిక ఫించన్లు అర్హులకు అందచేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... సామాజిక ఫించన్లలో అనర్హులను తొలగించేందుకు సాంకేతిక విధానాలను వినియోగించాలని సూచించారు. అదే విధంగా తల్లితండ్రులు లేని చిన్నారులకు సైతం ఫించన్లు ఇవ్వాలని కలెక్టర్లకు కీలక ఆదేశాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టేవారిని ప్రోత్సహించాలని కోరారు.

======================

విద్య, మౌలిక వసతులకు సంబంధించిన ప్రగతిపై ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇవ్వనున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విద్యా పరంగా ప్రగతి కనిపించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. జిల్లాలు, మండలాల వారీగా ఈ రేటింగ్ ఉంటుందని వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సదస్సులో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు ఉండేలా చూడాలని కోరారు. వసతి గృహాలలో పరిశుభ్రతపైనా ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని సరిదిద్దాలని అన్నారు.

విరామం

======================

నైరుతి - ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ప్రస్తుతం కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో శ్రీలంక, తమిళనాడు తీరాల వైపుగా ఇది పయనించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అనంతరం వాయుగుండంగా బలపడుతుందని అంచనా వేసింది. ఈ ప్రభావంతో రానున్న 48 గంటల్లో కోస్తా, రాయలసీమ ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆ వివరాలను అమరావతిలోని వాతావరణ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=======================

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హోం మంత్రి వంగలపూడి అనిత అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లాలోని తిరుమల, సూళ్లూరుపేట ప్రాంతాల్లో భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అలాగే ఘాట్ రోడ్ లో ప్రయాణించే భక్తులు సహా వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని కోరారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మత్స్యకారులకు ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా హెచ్చరికలు పంపి అప్రమత్తం చేయాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖను హోం మంత్రి ఆదేశించారు.

=======================

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు ఏలూరు జిల్లాలో నిర్వహిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఇ పి.సాల్మన్ రాజు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా  జిల్లా ప్రధాన కేంద్రాలు, డివిజన్ కేంద్రాలలో విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు చేపట్టానున్నామని చెప్పారు. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

=======================

జాతీయ స్థాయిలో శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ మొదటి స్థానంలో నిలిచిందని శ్రీకాకుళం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు చెప్పారు. శ్రీకాకుళంలో ఈ రోజు విలేకరులతో మాట్లాడుతూ... నెల 11, 12 తేదీలలో దేశవ్యాప్తంగా పోస్టల్ శాఖ గ్రామీణ తపాలా బీమా పథకం, తపాలా జీవిత బీమా పథకాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాకు తొలి స్థానం లభించిందని చెప్పారు. శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ నిన్న ఒక్క రోజు  కోటి 40 లక్షలు రూపాయలు కొత్త ప్రీమియం వసూళ్లు చేసిందని అన్నారు.

=======================

సంక్షేమం, అభివృద్ధి  అజెండాగా చేసుకుని రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలన సాగిందని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ రోజుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆరు నెలలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమం ద్వారా  ఆయన స్పందించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అనేక కీలక నిర్ణయాలను తీసుకున్నామని గుర్తు చేశారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌తో ఆంధ్రప్రదేశ్‌ను  అగ్ర స్థానంలో నిలబెడతామని ముఖ్యమంత్రి ప్రజలకు హామీ ఇచ్చారు. కాగా గత  ఆరు నెలలుగా రాష్ట్ర పునర్ నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

=======================

తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న కార్తిక మహా దీపోత్సవాలను పురస్కరించుకుని పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. కాట్పాడిలో  ఈ నెల 13, 14, 15వ తేదీలలో ఉదయం ప్రత్యేక రైళ్ళు బయలుదేరుతాయని పేర్కొంది. ఈ రైళ్ళు వేలూరు, ఆరణి రోడ్డు, పోలూరు, తిరువణ్ణామలై, తిరుకోయిలూర్, విళుపురంలో ఆగుతాయని వివరించింది.

========================

========================